
ప్రజాశక్తి
గురువారం 10 జులై 2025
5
పార్వతీపురం మన్యం



15 నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

పార్వతీపురం : పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహించడానికి ఈనెల 15 నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జులై 15 నుంచి 30 వరకు పక్షోత్సవాలు జరుగుతాయని, ప్రజలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పారిశుధ్య పక్షోత్సవాలు, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ పక్షోత్సవాల్లో మురికి కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రేయింగ్ చేయించడం వంటివి చేపట్టాలని తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



సాలూరులో భారీ ర్యాలీలో పాల్గొన్న అసంఘటిత, మున్సిపల్ కార్మికులు, స్కీం వర్కర్లు

సమ్మె సక్సెస్

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి
కార్మిక, రైతు, వామపక్ష నాయకుల డిమాండ్

హోరెత్తిన నినాదాలు
భారీ ఎత్తున ర్యాలీ, మానవహారాలు

ప్రజాశక్తి - పార్వతీపురం/ టౌన్

కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం జిల్లాలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. వివిధ రంగాల కార్మికులు, అసంఘటిత కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. పార్వతీపురం పట్టణంలో సుందరయ్య భవనం నుండి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల అమలకు ప్రయత్నిస్తుందని, ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. గత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు భిన్నంగా జరుగుతున్న 23వ సమ్మె ఇదని తెలిపారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకు, ఇన్సూరెన్స్, స్టీలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తుందని, అందులో భాగమే విశాఖ స్టీల్ ప్రైవేట్ పరం కాకుండా గత మూడేళ్లుగా కార్మికులు అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరణ వల్ల కార్మికులు, ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని, చైనాలో ప్రభుత్వ రంగం స్వతంత్రంగా ఉండడం వల్ల అతి వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మోడీ తీసుకొచ్చే నాలుగు లేబర్ కోడ్లు అమలైతే పని ప్రదేశాల్లో కార్మికులకు రక్షణ, ఆరోగ్య భద్రత, పని గంటలు, వారంతపు సెలవులు, లీవులు తదితర హక్కులు కోల్పోతారన్నారు. అందుకే యావత్ కార్మిక ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాసే కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు పరచాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేత, రైతులకు కనీస మద్దతు ధర అమలు చేయాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎం.గోపాలం, యుసిసిఆర్ఐఎంఎల్ జిల్లా నాయకులు బి.నరసింగరావు, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, వివిధ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు రెడ్డి వేణు, ఎం.భాస్కరరావు, సిహెచ్.సింహాచలం, ఎన్.శంకర్రావు, ఎం.ఉమామహేశ్వరి, గౌరీమణి, కె.రాజేశ్వరి, ఎం.శివాని, పి.లక్ష్మి, గోవింద, నిర్మల, ఎం.హరినాథ్, బంటు దాసు, పాలక రంజిత్ కుమార్, రెడ్డి శ్రీదేవి, బి.లక్ష్మి, జి.తులసి, చిన్నమ్మలు, జి.కృష్ణ, టి.అఖిల్, కె.రాజు, ఎం.వెంకటరమణ, పి.రాజశేఖర్, తదితర రంగాల కార్మికులు, మహిళలు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సీతంపేటలో మానవహారం చేపట్టిన కార్మికులు

కురుపాం : . సార్వత్రిక సమ్మెలో భాగంగా కురుపాం లో అంగన్వాడి వర్కర్ల కురుపాం ప్రాజెక్ట్ అధ్యక్షులు జె.సరోజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు. అనంతరం రావాడ జంక్షన్ నుంచి అంగన్వాడి, ఆశా వర్కర్లు , కార్మికులతో ధూలికేశ్వర ఆలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల జిల్లా కార్యదర్శి జి.జ్యోతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సీతారాం, నాయకులు పి.తిరుపతిరావు, ఎం.శ్రీను, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎం.జానకి, సిపిఐ నాయకులు కె.సూరయ్య, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బలిజి పేట : బలిజిపేటలో కార్మికులు, అసంఘటిత కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, మండల సమన్వయకర్త కె.దాలమ్మ, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేసి పని గంటలు పెంచడం మానుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీ అమలు చేయాలని, అంగన్వాడీలకు ఫేషియల్ యాప్ రద్దు చేయాలని, ఆశాలకు పని భారం తగ్గించాలని, స్కూల్ స్వీపర్ల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘ నాయకులు లక్ష్మి, భవాని, స్వర్ణ, సావిత్రి, రమా బాయి, వీరమ్మ, బలరాము, వెంకటస్వామి, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : సాలూరులో భారీ ర్యాలీ ద్వారా కార్మిక వర్గం పాల్గొని నిరసన తెలిపారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీ, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, విఆర్ఎ, మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, ఎండిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘం, గిరిజన సంఘం నాయకత్వం ముందు నడవగా ,కార్మిక వర్గం భారీగా పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మెయిన్ రోడ్డు గుండా చిన్న బజారు, వేద సమాజం, నాయుడు, వీధి, శివాజీ బొమ్మ జంక్షన్ నుంచి బోసు బొమ్మకు చేరుకొని సభ జరిగింది. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అసిరి, పాచిపెంట, మక్కువ మండలాల సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు, కృష్ణారావు, గౌరి, శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దాలమ్మ, పార్వతీదేవి, శశికళ, పార్వతి, పుష్ప, రవణమ్మ, పవన్ కుమార్, శంకరరావు, ఇందూ, రాముడు, వెంకటలక్ష్మి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బజార్ వరకు ప్రజాసంఘాలు ర్యాలీని నిర్వహించాయి. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు సిహెచ్ కృష్ణ, బి.అప్పారావు, జి.వెంకటరమణ, వి.రామలక్ష్మి, శాంతికుమారి, సత్యవతి, సునీత, రాము, టి.రమేష్, శంకర్రావు, అన్నపూర్ణ, పద్మ, శివున్నాయుడు, తిరుపతిరావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.తిరుపతిరావు, ఎ.భాస్కరరావు, ఎం.కాంతారావు, సురేష్, జె. శ్రీరాములు, పి. సాంబయ్య, పార్వతి, ఏ అంజలి, అరుణ, రొయ్య భారమ్మ, లక్ష్మి, దర్శమి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. సమ్మెను ఉద్దేశించి సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి శ్రీను నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్ట్ కార్యదర్శి అనురాధ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, ఎపి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామారావు, భవన కార్మికుల సంఘం నాయకులు గౌర్నాయుడు, శ్రీ విముక్తి సంఘం రాష్ట్ర నాయకులు పి.కృష్ణవేణి, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటస్వామి, అంగన్వాడీ సెంటర్ లీడర్లు జ్యోతి, పద్మ, వరలక్ష్మి, కార్మికులు, విఆర్ఎలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాలకొండ: సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోటదుర్గ ఆలయ ఎదురుగా నిరసన చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు బి.అమరవేణి, కాదా రాము, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు ఎన్.హిమాప్రభ, జి. జెస్సిబాయి, జి.శారద, ఎస్. గంగమ్మ, కె.గౌరేశ్వరి, చిట్టెమ్మ, రాధ, రామలక్ష్మి, రాజేశ్వరి, ఎస్.శాంతి, బి.చిన్నమడు, ఎం.శ్రీను, ఎం.గోపి, సిహెచ్.సంజీవి, వై.హరిబాబు, శ్రీదేవి, సురేష్, ఎం.వీరంనాయుడు, అర్తమూడి లక్ష్మణరావు, టి.శ్రీరాములు, బి.శివ, ఎం.రమేష్, జి.సత్యం, వై.శ్రీనివాసరావు, జె.గోవిందరావు, పి.రాజశేఖర్, పి.మహేష్, ఎస్.నాగరాజు, ఎస్.కామేష్, కె.శ్రీనివాసు, వి.అప్పారావు, దుర్గారావు, నక్క సుదర్శన్ రావు, పొట్నూరు రాంబాబు, వి.సుందరరావు, వై.ఈశ్వరరావు, జి.మన్మధరావు, రాము, దూసి దుర్గారావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాద్ రావు, నారాయణరావు ర్యాలీకి నాయకత్వం వహించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో వివిధ రంగాల కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.గౌరీశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి జి.జ్యోతి, నాయకులు కస్తూరి, సత్యవతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్మల, శ్రీకన్య, సుశీల, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు ఆదమ్మ, గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, ఆడిట్, సన్యాసిరావు ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారం, డివైఫ్ఐ నాయకుల సురేష్, యువజన సంఘం నాయకులు ప్రకాష్లి తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురంలో సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

వీరఘట్టం : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్ సింహాచలం, మండల కార్యదర్శి ఎన్.ప్రసాదరావు, వై.ప్రసాదరావు, పి.ప్రసాదరావు, పి.మజ్జి ఈశ్వరరావు, డి శ్రీను, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఎఐసిసిటియు ఆధ్వర్యంలో కూడా సార్వత్రిక సమ్మె కార్యక్రమం నిర్వహించారు.

మక్కువ : కార్మిక, రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా మక్కువలో సార్వత్రిక సమ్మె నిర్వహించబడింది. ఈ సందర్భంగా కర్రల మిల్లు వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మార్కెట్లో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు నాయకులు మండంగి ప్రసాద్, మర్రి చెంచు, మర్రి బుగిలమ్మ, కార్మికులు, రైతులు, గిరిజనులు పాల్గొన్నారు.



కురుపాంలో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

మెగా పిటిఎంకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీట్ 2.0ను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల విద్యాశాఖాధికారులు, ప్రధాన ఉపాధ్యాయులను ఆదేశించారు. మెగా పిటిఎం ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా మండలంలోని ఉల్లిభద్ర మండల పరిషత్ ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించేందుకు గదులను సిద్ధం చేసుకోవాలని, పిటిఎం జరిగినట్లుగా వీడియోను చిత్రీకరించాలని పేర్కొన్నారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులు, ప్రముఖులు, విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తొలుత పిటిఎం ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆయన పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంట గది తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించి, ఒక విద్యార్థి పుట్టిన రోజు కావడంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఆయన విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని, ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. పర్యటనలో ఎంఇఒ-1 ఎస్.సింహాచలం, ప్రధాన ఉపాధ్యాయులు పి.సిహెచ్.శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సీతంపేట : ప్రభుత్వం తలపెట్టిన పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలని విద్యాశాఖ ఆర్‌జెడి విజయభాస్కర్ అన్నారు. స్థానిక కెజిబివి కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. అనంతరం ఎంఆర్‌సి కార్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థుల డ్రాప్స్ అవుట్స్ రికార్డులను పరిశీలించి 1133 మంది విద్యార్థులు ఎందుకు డ్రాప్ అవుట్‌గా ఉన్నారని ఎంఇఒలను ప్రశ్నించారు దీంతో పదో తరగతి రిలీవ్ అయిన విద్యార్థులను సమాధానం చెప్పారు. కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జ్ మాధవి, ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శత శాతం స్ప్రేయింగ్‌తో మలేరియా నిర్మూలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో శతశాతం ఎసిఎం పిచికారీ జరిగితే మలేరియాను నిర్మూలించడం సాధ్యమవుతుందని మలేరియా రాష్ట్ర కన్సల్టెంట్ రామచంద్రరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నోంద్రకోనలో జరుగుతున్న రెండో విడత ఎసిఎం స్ప్రేయింగ్‌ను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద, పరిసరాల్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలని సూచించారు. మలేరియా దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్ అత్యంత కీలకమన్నారు. దోమ కాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడకం చేయాలని సూచించారు. అనంతరం కల్లటి, జోబగూడ, చింతమానుగూడ, కేదారిపురంలో జరుగుతున్న స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గుమ్మలక్ష్మీపురంలోని పిటిజి గురుకుల పాఠశాలలో సిక్ రూములు పరిశీలించారు. వాటికి మెష్‌లు బిగించాలని హాస్టల్ వార్డెన్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్, సూపర్ వైజర్ అప్పలనాయుడు, ఎంఎల్‌హెచ్ పి.రతీదేవి, వార్డెన్ హేమలత, ఏ ఎన్ ఎమ్ లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి అరాచకానికి చిరు వ్యాపారి బలి

- ఆత్మహత్యకు కారణం డబ్బి కృష్ణారావే
- సంధ్యారాణి గారు.. మా కుటుంబానికి న్యాయం చేయండి
- ఆడియోలో మృతుడు నాగభూషణరావు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఓ చిరు వ్యాపారి వడ్డీ వ్యాపారి అరాచకానికి బలయ్యాడు. వడ్డీ వ్యాపారి ధనదాహం తట్టుకోలేక తనువు చాలించాడు. బుధవారం ఉదయం 4.30 సమయంలో తన షాపులోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. తాను నమ్మిన స్నేహితుడే తనని నట్టేట ముంచేశాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యకు ముందు చిరు వ్యాపారి ఇందూరి నాగభూషణరావు రికార్డు చేసిన ఆడియోను విడుదల చేశాడు. ఆ ఆడియో చాలా మందికి పంపించడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది.

పట్టణంలోని మామిడిపల్లి జంక్షన్‌లో ఎలక్ట్రిక్ షాపు నడుపుతున్న వ్యాపారి ఇందూరి నాగభూషణరావు డబ్బివీధికి చెందిన వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు వద్ద సుమారు 40లక్షల వరకు వాడుకున్నాడు. ఆ డబ్బు ఎప్పటికీ తిరిగి ఇవ్వడం లేదని వ్యాపారి షాపును వడ్డీ వ్యాపారి కృష్ణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోటి రూపాయల విలువైన షాపును రూ.75లక్షలకే వడ్డీ వ్యాపారి కొనుగోలు చేశారు. నాగభూషణరావు వాడుకున్న రూ.40లక్షల అప్పు మినహాయిస్తే మిగిలిన రూ.35లక్షలు ఆయన చేతికి ఇవ్వాలి. కానీ వడ్డీ వ్యాపారి రూ.10లక్షలే నాగభూషణరావుకు ఇచ్చి రూ.25లక్షలు తన వద్దే వుంచుకున్నారు. వడ్డీ వ్యాపారి కృష్ణారావు కొనుగోలు చేసిన షాపును నాగభూషణరావుకు తనఖా ఇచ్చారు. తనఖా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి స్వాధీన తనఖా పత్రం రాసి వడ్డీ వ్యాపారి ఇచ్చినట్లు నాగభూషణరావు ఆవేదన వ్యక్తంచేశారు. షాపునకు అద్దె కింద నెలకు రూ.20వేలు, పది లక్షలకు వడ్డీ రూ.10వేలు చొప్పున నాగభూషణరావు ప్రతినెలా కృష్ణారావుకు చెల్లిస్తున్నారు. తన డబ్బు ఉంచుకొని తన వద్దనే వడ్డీ డబ్బులు వసూలు చేయడం, షాపు తనఖా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి సాధారణ తనఖా పత్రం రాయడం, దీనికి నెలనెలా అద్దె వసూలు చేయడంతో నాగభూషణరావు భరించలేక, కృష్ణారావు అరాచకాలను ఎదురించలేక ఆత్మహత్య కు పాల్పడినట్లు ఆయన విడుదల చేసిన ఆడియోలో వివరించారు. నాగభూషణరావుకు భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన నాగభూషణరావు జేబులో రాతపూర్వక లేఖ కూడా వున్నట్లు తెలుస్తోంది.పోలీసులు ఆ లేఖను స్వాధీనం చేసుకున్నారు.


ఉరివేసుకొని మృతి చెందిన నాగభూషణ రావు

కృష్ణ మోసాన్ని భరించలేకనే ఆత్మహత్య

వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు, తాను స్నేహితులం. తన స్నేహితుడు ఇలా మోసం చేస్తాడని ఊహించలేదు. కోటి రూపాయల విలువైన షాపును రూ.75లక్షలకే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తన అప్పులు రూ.40లక్షలు మినహాయిస్తే మిగిలిన రూ.35లక్షలు నాకు రావాలి. ఆ డబ్బులు పూర్తిగా ఇవ్వకుండా నాకు ఇవ్వాల్సిన డబ్బు వుంచుకుని షాపుకు అద్దె వసూలు చేశాడు. అడిగితే ఓసారి ఐదు లక్షలు, మరోసారి ఐదు లక్షల రూపాయలు ఇచ్చాడు. షాపును తనఖా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి స్వాధీన తనఖా రాయించారు. నాడబ్బుకి వడ్డీ కింద పదివేలు, షాపుకి అద్దె కింద 20వేల రూపాయల చొప్పున వసూలు చేశాడు. నమ్మిన స్నేహితుడు కృష్ణారావు మోసాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని నాగభూషణరావు ఆడియో విడుదల చేశాడు.

సంధ్యారాణి గారు కుటుంబానికి న్యాయం చేయండి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఉద్దేశించి కూడా చిరు వ్యాపారి నాగభూషణరావు ఆడియో విడుదల చేశాడు. తన స్నేహితుడు కృష్ణారావు మోసాన్ని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నాడు. తనకు కృష్ణారావు ఇవ్వాల్సిన డబ్బు రూ.15లక్షలు, నెలనెలా చెల్లించిన డబ్బు రూ.12లక్షలు తన కుటుంబానికి ఇప్పించాలని కోరాడు. తన కుటుంబానికి అదే ఆస్తి అని చెప్పాడు. కృష్ణారావు మోసాన్ని మీతో చెప్పడానికి ప్రయత్నించానని, కానీ పరిస్థితి అనుకూలించక చెప్పలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.

రంగంలోకి టిడిపి నాయకులు

పాచిపెంట మండలం మాతుమూరు నుంచి వలస వచ్చిన ఇందూరి నాగభూషణరావు 32ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నారు. టిడిపికి చెందిన వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు మోసానికి బలై నాగభూషణరావు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో సంచలనమైంది. టిడిపి నాయకుడైన కృష్ణారావును రక్షించేందుకు పాచిపెంట మండలానికి కీలక నాయకుడు రంగప్రవేశం చేశారు. ఆత్మహత్య చేసుకున్న వ్యాపారి నాగభూషణరావు కుటుంబానికి కొంత మొత్తం ఇప్పించే ప్రయత్నంలో భాగంగా కేసు రాజీ చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది.

ప్రజల దృష్టికి కూటమి అరాచకాలు : ఎమ్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అరకు ఎంపి డాక్టర్ తనూజరాణి వైసిపి శ్రేణులకు సూచించారు. బుధవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వార్డులు, గ్రామాల వారీగా ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇంత వరకు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత వైసిపి క్యాడర్‌పై ఉందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ప్రజలకు పూర్తిగా మోసాలు చేసే అధికారంలోకి వచ్చారన్నారు. జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20 వరకు నియోజకవర్గ, మండల, నగర పంచాయతీ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ మరింత ప్రజల్లోకి వెళ్లే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి జరుగుతున్న అక్రమాలు, అరాచకాలు ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. నిబంధనల పేరుతో తొలగిస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గ ప్రభుత్వాన్ని తరిమికొట్టే బాధ్యత వైసిపి శ్రేణులు తీసుకోవాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, పాలకొండ వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధరావు, సీతంపేట వైస్ ఎంపిపి కె.సరస్వతి ఉన్నారు

చంద్రబాబు మోసాన్ని ప్రజలు గుర్తించారు : రాజన్నదొర

సాలూరు: అధికారంలోకి రాకముందు లేనిపోని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గుర్తించారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన పట్టణ వైసిపి సమావేశంలో ఆయన మాట్లాడారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా పట్టణ నాయకులు కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ మోసాలను ఎత్తిచూపాలని కోరారు. సూపర్ సిక్స్ హామీల ను అమలు చేసే ఉద్దేశం లో ప్రభుత్వం లేదన్నారు. ఇచ్చిన పథకాల్లో నూ కోతలు విధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు పాల్గొన్నారు.

అనంతరం రామా కాలనీలో ఇంటింటి కి తిరిగారు.గడచిన ఏడాది కాలంలో ప్రజలు నష్టపోయిన పథకాల విలువ ని వివరించారు.వైసిపి ప్రభుత్వం హయాంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు గొర్లి జగన్ మోహన్ రావు,వార్డు నాయకులు మేకల శంకరరావు వున్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు పంట బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులకు తక్కువ ప్రీమియం చెల్లింపుతో బీమా పథకం అమలు జరుగుతుందని ఆయన చెప్పారు. తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులంతా బీమా పథకంలో చేరడానికి అర్హులని తెలిపారు. రైతులు వరి పంటకు ఆగస్టు 15 లోగా, మొక్కజొన్న పంటకు జూలై 31లోగా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. పత్తి, అరటి పంటల బీమా జూలై 15 లోగా చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. వివరాలకు రైతు సేవా కేంద్రం, వ్యవసాయ కార్యాలయం, ఉద్యానవన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వరి, మొక్కజొన్న పంటల ఫసల్ బీమా యోజన వివరాలకు టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ పి అచ్చన్న నాయుడు (9951142337) ఫోన్ నంబరు సంప్రదించవచ్చని తెలిపారు. పత్తి, అరటి ఫసల్ బీమా యోజన వివరాలకు ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు, టోల్-ఫ్రీ నంబర్ 14447, వ్యవసాయ శాఖ 155251 కు ఫోన్ చేయవచ్చునని లేదా వాట్సాప్ నెంబర్ 7065514447 ద్వారా సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

బాలేరులో పిఎం సురక్షిత మాతృత్వ అభియాన్

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరు పిహెచ్‌సిలో డాక్టర్ జి.శివకుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి పరిశీలించారు. గర్భిణీలో సుఖ ప్రసవం కోసం, ప్రతి నెలా 9న ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా 49 మంది గర్భిణీలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బాలేరో పిఎస్సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


కొమరాడలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


బలిజిపేటలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు, స్కీం వర్కర్లు

సార్వత్రిక సమ్మె దృశ్యమాలిక


గుమ్మలక్ష్మీపురం : సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు


సీతానగరంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


వీరఘట్టంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


బిజెపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బిజె పురంలో' సుపరి పాలన తొలి అడుగు'

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలోని బిజె పురంలో మండల టిడిపి కన్వీనర్ పల్ల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ పాల్గొని సంవత్సర పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, ఎంపిపి బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఖరీఫ్ సీజన్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఉప ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కెవిఎస్ పద్మావతి అన్నారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో గల వివిధ రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఆసుపత్రి పరిధిలో గల గర్భిణీల వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. ప్రతి గర్భిణీకు తప్పనిసరిగా అబా ఐడి క్రియేట్ చేయాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పిలకు పలు సలహాలు, సూచనలు అందజేసి వైద్య సేవలు విస్తృతం చేయాలన్నారు. ఎన్డీసీ 3.0 సర్వే చేయాలని సికిల్ సెల్ ఎనీమియా అన్ని స్కూలు పిల్లలకు పరీక్షలు చేయాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్ వచ్చిన పిల్లలకు ప్రతి నెలా రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ తనూజ, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం పిఎసిఎస్ అధ్యక్షులుగా డొల్లు కిషోర్

ప్రజాశక్తి - కురుపాం



స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులుగా కిచ్చాడకు చెందిన డొల్లు కిషోర్‌ను నియమించినట్లు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, కూటమి నాయకులు ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. పిఎసిఎస్ ద్వారా రైతులకు అందాల్సిన రుణాలు సక్రమంగా సరైన సమయంలో అందేలా చర్యలు చేపట్టి రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.

పోస్టాఫీసులో ఆన్‌లైన్ సేవలు అందించాలి

ప్రజాశక్తి -కురుపాం

మండలంలోని మొండెంఖల్ పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ సేవలు మరమ్మతులు చేపట్టాలని టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పోస్ట్ ఆఫీస్ వద్ద నుంచి ఆయన మాట్లాడుతూ రెండు నెలల నుంచి పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ సేవలు పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల లావాదేవీలు జరగకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆన్లైన్ మరమ్మతులు చేపట్టి ప్రజలకు పోస్టాఫీస్ సేవలు అందించాలని కోరుతున్నారు.

కురుపాంలో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - కురుపాం

మేజర్ పంచాయతీ కురుపాంలో ఇఒ సురేష్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ ఆధ్వర్యంలో బుధవారం దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఇటీవలే వర్షాలు పడిన నేపథ్యంలో గ్రామంలోని కాలువల్లోనూ, నీటి నిల్వ ఉన్న గుంతల వద్ద దోమలు చేరి ప్రజలు మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గ్రామంలో గల అన్ని వీధుల్లో దోమల మందు పిచికారీ చేయించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

4,118 మొక్కలు నాటేందుకు చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 4,118 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు బుధవారం తెలిపారు. ఈనెల 10న మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తల్లి నుంచి పాఠశాల ఆవరణలో ఒక మొక్క నాటేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే అన్ని పాఠశాలల్లోనూ మెగా పేరెంట్స్ డే కార్యక్రమం ఘనంగా జరిపించేందుకు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణంలో 3టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పెద్ద బజార్లో తనిఖీలు నిర్వహించగా ముద్దాపు సురేష్ వద్ద సుమారు 3250 కేజీల పిడిఎస్ బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించగా పట్టణ పరిసర ప్రాంతాల నుంచి చిన్నచిన్న వర్తకులు కొనుగోలు చేసినట్లు సురేష్ తెలిపారని తెలిపారు. పట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు.

గర్భిణులకు వైద్య తనిఖీలు


ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, విటిలావ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం వైద్య అధికారులు బి.ప్రదీప్‌కుమార్, ఎ.మానస గర్భిణులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహ, రక్తపోటు, ఎత్తు, బరువు, తదితర రక్తపరీక్షలు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఒ.కు భారతమని, ఆదిలక్ష్మి, ఎన్.లలితకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌గా కెవి కొండయ్య

ప్రజాశక్తి - కురుపాం

మండల టిడిపి కన్వీనర్‌గా కె వి కొండయ్యను బుధవారం కురుపాం కోటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే జగదీశ్వరి, రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్ర దేవ్ టిడిపి నాయకులు, కార్యకర్తలు తనపై నమ్మకం ఉంచి కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కన్వీనర్‌గా ఎన్నికైన కొండయ్యను వీరేష్ చంద్రదేవ్, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.


కొండయ్యను అభినందిస్తున్న వీరేష్‌చంద్రదేవ్

జంఝావతి ద్వారా ఖరీఫ్‌కు సాగునీరు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కొమరాడ

వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జంఝావతి జలాశయం (వికెఎంఎన్‌జెఆర్) ద్వారా ఖరీఫ్‌లో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఇఇ ఎ.ఢిల్లీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల17న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన లక్ష్యం కొండంత.. నీరిచ్చేది గోరంత అన్న వార్తకు ఆయన స్పందించారు. ఈ జలాశయం ద్వారా 5 మండలాల పరిధిలోని 75 గ్రామాలకు చెందిన 24,640 ఎకరాల భూమికి సాగునీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈ ఆయకట్టు ద్వారా పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేసేందుకు 450 క్యూసెక్కుల నీరు అవసరమని, కాని ఒడిషా రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరం కారణంగా రిజర్వాయర్‌లో నీటి నిల్వకు వీలు కావడం లేదన్నారు. అందువల్ల ఒడిషా భూములు ముంపునకు గురికాకుండా 2005-06లో తాత్కాలికంగా రబ్బరు డ్యామును నిర్మించి నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జంఝావతి ప్యాకేజీ-2 మిగిలిన కాలువ పనులను పూర్తికి రూ.54 కోట్లతో అంచనాలు తయారు చేసి అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. కొమరాడ మండలం డంగభద్ర వద్ద 40 శాతం పూడికతీత పనులు చేశామని, ఉపాధి హామీ పథకం ద్వారా పూడికను కొంత మేరకు తొలగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

గిరిజనులకు కెనరా బ్యాంక్ అద్దె చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గొరడలో గల గిరిజన కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు అద్దె చెల్లింపులు పీసా సభ్యులకు ఇచ్చేలా ప్రభుత్వం, ఐటిడిఎ పిఒ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 2015లో కెనరా బ్యాంకు ఏర్పాటు కోసం అప్పటి ఎంపిడిఒ అరుంధతిదేవి, బ్యాంకు మేనేజర్ పదేళ్ల పాటు ఎటువంటి అద్దె చెల్లింపులు లేకుండా బ్యాంకు నిర్వహణకు ఇచ్చారన్నారు. అయితే ఈ విషయం గ్రామపెద్దలెవరికీ కూడా తెలియదన్నారు. ఇది 1/70 చట్టానికి, పీసా చట్టానికి వ్యతిరేకంగా ఉందన్నారు. ఏజెన్సీలో ఆస్తులను బదలాయించాలన్న ఎంపిడిఒకు ఎటువంటి అధికారం లేదన్నారు. 2023 సెప్టెంబర్‌లో ఐటిడిఎ పిఒను కలిశామన్నారు. అగ్రిమెంట్ కాల పరిమితి 2015 నుంచి 2025 వరకు పదేళ్లు పూర్తయిందన్నారు. కమ్యూనిటీ భవనంలో బ్యాంకు నిర్వహణ అద్దె చెల్లింపులు ఐదేళ్లపాటు గిరిజనులకు అందేలా పిఒ ఆదేశాలు ఇచ్చారన్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్ దర్యాప్తు చేసి నెలవారీ అద్దె చెల్లింపులు రూ.6800 జరిగేలా తీర్మానం చేయడం జరిగింది అన్నారు. అయితే ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ సాల్మన్ రాజుకు ఇదే విషయమై పలుమార్లు అడగ్గా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారని


ఎస్‌డిసికి వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అన్నారు. బదిలీపై వెళ్లిన ఎంపిడిఒ సాల్మన్‌రాజు బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై ఇల్లీగల్ అగ్రిమెంట్ మరో పదేళ్లపాటు పెంచుతూ అద్దె చెల్లింపులు లేకుండా రాయించారనే విషయం బయటపడింది అన్నారు. అనధికారింగా అనుమతులు ఇచ్చిన ఎంపిడిఒ సాల్మన్‌రాజు పై, బ్యాంకు మేనేజర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులతో కలిసి గుమ్మలక్ష్మీపురం ఎస్‌డిసి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ భవనం అద్దె చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సురక్షిత ప్రసవమే లక్ష్యంగా వైద్య సేవలు

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణులకు సురక్షిత ప్రసవమే లక్ష్యంగా వైద్య సేవలు అందించాలని జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని కెఆర్‌బిపురం, కొమరాడ పిహెచ్‌సిల్లో ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలను మాతా, శిశు సంరక్షణ కార్డుల్లో పరిశీలించారు. ప్రతి గర్భిణీకి పూర్తి స్థాయిలో ఆరోగ్య పరీక్షలకు జరిపి హైరిస్క్ సమస్యను ముందుగానే గుర్తించి, వారి ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మారుమూల, గిరిశిఖర గ్రామాల గర్భిణీలను ప్రసవ సమయానికి ముందుగానే గర్భిణీ వసతిగృహల్లో చేర్చాలన్నారు. అనంతరం ఆయన గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకొని పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ అరుణ్‌కుమార్, డాక్టర్ శిరీష, డాక్టర్ గణేష్ పట్నాయక్, డెమో వై.యోగేశ్వర రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' రైతులకు ఉపయోగం : ఎడిఎ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఎడిఎ అన్నపూర్ణ అన్నారు. మండలంలోని గంగరేగువలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన గ్రీవెన్స్ ఇచ్చేందుకు ఈనెల 10 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. రైతులు కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన పథకం కింద రైతులు సొంతగా పంట బీమా నమోదు చేయించుకోవాలన్నారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ గ్రీవెన్సెస్, కౌలు రైతులు కార్డులు, పంటల భీమా, వరి పంట నారు మడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కంది విత్తనాల పంపిణి చేశారు. కార్యక్రమంలో రైతుశిక్షణా కేంద్రం ఎడిఎ శ్రీనివాసరావు, శారద, వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాద్, ఎంపిఒ భవాని, రైతులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యమే మన ఆరోగ్యం

ప్రజాశక్తి - పాచిపెంట

పంటలు పండించే భూమి ఆరోగ్యంగా ఉంటేనే ఆ పంటలు తినే మనుషులు కూడా ఆరోగ్యంగా ఉంటారని మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ అన్నారు. మండలంలోని పాంచాలిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రైతు దిగుబడుల కోసం ఆలోచించకుండా కనీసం తను తినే తిండి గింజల వరకైనా ప్రకృతి సేద్య పద్ధతుల్లో వ్యవసాయం కొనసాగించాలని, లేనిచో ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. విచక్షణారహితంగా ఎరువులు వాడొద్దని, దాని వల్ల పంట భూములు చౌడుబారుతాయని అన్నారు. ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి రైతు పంటల బీమా నమోదు చేసుకోవాలని, వాతావరణ ఆధారిత పంటల భీమా పథకానికి వినియోగించుకోవాలన్నారు. ఇందుకు ఈనెల 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అధిక మోతాదులో ఎరువులు వేస్తే వానపాములు ఎంత తొందరగా చనిపోతాయో ప్రయోగాన్ని చేసి చూపించారు. గట్లపై అంతర్ పంటలుగా కంది విత్తనాలను సర్పంచ్ గూడెపు యుగంధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎ ఈదిబిల్లి శ్రీను, సిఆర్‌పి తిరుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నాణ్యమైన ఆహారంతో నిరుపేదల ఆకలిని తీర్చేందుకే అన్న క్యాంటీన్లు వెలిశాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద గల అన్న క్యాంటీనును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిసరాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఒక సామాన్యుని మాదిరిగా లైనులో నిల్చొని స్వయంగా టోకెన్ తీసుకొని అన్న క్యాంటీన్‌లో తయారైన ఆహారాన్ని రుచి చూశారు. జిల్లాలో పార్వతీపురం, పాలకొండ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఉన్నాయని, ఒక రోజుకు ఒక వ్యక్తికి ఆహారం అందించడానికి రూ.90 ఖర్చు కాగా, పేదల కోసం కేవలం రూ.15కే ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. పేదల కోసం ఏర్పాటైన అన్న క్యాంటీన్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, అన్న క్యాంటిన్ ఆహారం పట్ల కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేటలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లే బుట్ట బుట్ట ద్వారా సప్త సేకరణ చేసి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి ఎరువులు తయారు చేసి దాని ద్వారా ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ బి.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, క్రాప్ మిత్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మాలి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపులను, పాలకొండ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి పరిశీలించారు. గోడౌన్లో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. మండలంలో ప్రైవేట్ డీలర్ల వద్ద 700 టన్నుల వివిధ రకాల ఎరువులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వం రైతులకు నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మకాలు చేపట్టాలని, కృత్రిమ కొరత సృష్టించొద్దని ఎరువుల షాపుల యజమానులకు సూచించారు. డీలర్ షాప్ లో స్టాక్ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్ ను పరిశీలించారు. ఎరువులు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. ధరల పట్టికలను షాపులో కనబడే విధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.తిలక్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వసంత కుమారి

ప్రజాశక్తి -భామిని

పూర్తి అదనపు బాధ్యతలపై భామిని ఎంపిడిఒగా శేసపు వసంతకుమారి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనపై కృషి చేస్తానన్నారు.

104 వాహనాల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొండ

108, 104 వాహనాలను ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ డిప్యూటీ ఇఒ నరేంద్రద బుధవారం ఆకస్మికం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఉన్న నవజాత శిశు అంబులెన్సులో ఉన్న మెడిసిన్‌లను, పరికరాల పనితీరును, రికార్డులను, వాహనాలు కండిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో చిన్నపిల్లలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహనతో పాటు, హాస్పిటల్‌కు తీసుకొచ్చే సమయంలో ఇవ్వాల్సిన మెరుగైన చికిత్స విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 108 రీజనల్ మేనేజర్ బాలరాజు, 104, 108 జిల్లా అధికారులు మన్మధనాయుడు, జిల్లా ఆపరేషన్ అధికారి గిరిబాబు సిబ్బంది గిరి గణపతి, రమణలు పాల్గొన్నారు.

8,9తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - పాలకొండ

సిపిఐ పార్వతీపురం మన్యం జిల్లా ద్వితీయ మహాసభలు పాలకొండలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు తెలిపారు. జిల్లా సమితి కార్యవర్గ సమావేశం బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగింది. సిపిఐ రాష్ట్ర నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు సమక్షంలో జరిగిన సమావేశంలో జిల్లా సమితి, కార్యవర్గ సభ్యులు హాజరై పార్టీ గత మూడేళ్లుగా జిల్లాలో పేద, బడుగు బలహీన వర్గాల పక్షాన, కార్మికులు, రైతులు సమస్యల పరిష్కారం కోసం, నిరంతరం పోరాడుతూ పనిచేస్తున్న పార్టీ సిపిఐ అని తెలిపారు. సమావేశంలో పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకొని ఏ విధంగా లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలో అన్న అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి కోసం ఆర్థిక వనరులను ముందుగా గుర్తించాలన్నారు. వాటితోనే గ్రామానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు చేయచ్చన్నారు. అలాగే బిఫోర్ సర్వేలో పేదల కుటుంబాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు సర్వేలో సిబ్బంది పాల్గొనన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, రిసోర్స్ పర్సన్లు శ్రీనివాసరావు, శశి కుమార్, వివిధ గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

వీరఘట్టం: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎఇ కె అనిల్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్, కొత్త కనెక్షన్లు జారీలో ఆలస్యం, మీటర్ల లోపాలు, సర్వీస్ లో లోపాలు ,రీ కనెక్షన్ సమస్యలు, కాలిపోయిన మీటరు, కనెక్షన్‌లో మార్పు, బిల్లులు తప్పులు, తదితర సమస్యలపై సదస్సులో తెలియజేసుకోవచ్చునని తెలిపారు.


కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, నాగార్జున

అభివృద్ధే లక్ష్యం : కిమిడి

ప్రజాశక్తి - సీతానగరం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు మండలంలోని కృష్ణాపురంలో బుధవారం సాయంత్రం సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి ఒకరు మృతి

ప్రజాశక్తి - భామిని

భామిని సమీపాన ప్రధాన రహదారిపై బైకు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డోకులుగుడకు చెందిన కొండ గొర్రి నాగేశ్వరరావు (40) మృతి చెందగా, బిడ్డిక సంజీవ్ చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం నాగేశ్వరరావు తన అత్త వారు గ్రామమైన నెలమాను గూడ నుంచి భామిని మీదుగా డోకులు గూడ వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నాగేశ్వరరావు భార్య లలిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎఎస్ఐ కాంతారావు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు బత్తిలి ఎస్ ఐ అప్పారావు తెలిపారు.

ఖరీఫ్ వరి పంటకు ఫసల్ బీమా

కొత్తవలస: ఈ ఏడాది ఖరీఫ్ వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం వర్తిస్తుందని కొత్తవలస ఎడిఎ బి.భానులత తెలిపారు. బుధవారం గనిశెట్టిపాలెం, దెందేరు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కెవి.రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రధానమంత్రి పర్సనల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దెందేరు పశు వైద్యాధికారి ఎ. అరుణ కిరణ్, పంటల భీమా ఫీల్డ్ కోఆర్డినేటర్ ఉమాశంకర్, విఎఎ దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో బుధవారం ఎఒ ఎం.స్వాతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సుడోమనాస్‌తో విత్తన శుద్ధి గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వ్యవసాయ విస్తరణ అధికారి అక్కునాయుడు, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని కొండగుంపాం, కొండవెలగాడ గ్రామాల్లో బుధవారం ఎఒ పి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలని, విత్తనాలు ప్రైవేటు వర్తకులు దగ్గర కొనేటప్పుడు తప్పనిసరిగా మొలక శాతం కట్టుకోవాలని, విత్తన బిల్లులను భద్రపరచుకోవాలని తెలిపారు.